

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 08-08-2026 | సంపుటి - 31 | సంచిక - 75 | రూ : 4 | పేజీలు: 8


# 'ఇలాగైతే కుబేరుడూ కూలికి వెళ్తాడు'

## కోటీశ్వరులకూ రైతుబంధు ఇస్తారా?

- ఒక్క తెల్లకార్డూ తొలగించలేని పరిస్థితి
- ఉచిత పథకాలపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- కోర్టుకు హాజరైన సందీప్‌కుమార్ సుల్తానియా



హైదరాబాద్: కూర్చుంటే సొమ్ము.. నిలుచుంటే సొమ్ము.. ఎలా పడితే అలా పరిమితికి మించి అమలు చేస్తున్న ఉచిత పథకాలతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇన్ని ఉచిత పథకాలు అమలు చేస్తూ పోతే కుబేరుడైనా పనికి ఆహారం వంటి పథకం కింద కూలి పనికి వెళ్తాడని... ఆ ఖాతా పేరూ 'కుబేర' అని వ్యాఖ్యానించింది. కంటోన్మెంట్ బోర్డుకు రూ.33.42 కోట్లు విడుదల చేయాలని 2024లో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలంటూ ఇచ్చిన వినతిపత్రాలపై చర్యలు తీసుకోకపోవడంతో కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు

తరువాయి 2లో



## భయపడొద్దు, నేనున్నాను
## టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని భరోసా

- ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్
- టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని
- "ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా
- పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని

### ఎంపీలకు సూచన

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం

తరువాయి 2లో




## నీట్ ప్రశ్నలు లీక్ చేసింది ఆ ముగ్గురే

2లో

- చార్జిషీట్‌లో సీబీఐ స్పష్టం 20 వేల పేజీల ఆధారాలు ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో సమర్పించినట్టు వెల్లడి

## దేశంలో అత్యుత్తమ జోన్‌గా విశాఖ జోన్
## రూ.2,493 కోట్ల ఆదాయంతో రికార్డు

సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఉత్తమ జోన్‌గా నిలిచిందన్న రైల్వే శాఖ

- ఏపీలో ప్రస్తుతం రూ. 54 వేల కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడి
- మరో రూ.71 వేల కోట్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయన్న రైల్వే శాఖ






2లో

## కేరళలో భారీ వర్షాలు
## 8 జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవు



- స్కూళ్లు, కాలేజీలతో సహా అన్ని విద్యా సంస్థలకు వర్తింపు
- పలు జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ
- పరీక్షలు, ఇంటర్వ్యూలు యథాతథం

కేరళలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఎనిమిది జిల్లాల్లోని విద్యా సంస్థలు నేడు మూతపడ్డాయి. భారత వాతావరణ శాఖ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేయడంతో పత్తనంతిట్ట, అలప్పుజ, కొట్టాయం, ఎర్నాకుళం, త్రిస్సూర్, వయనాడ్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాల కలెక్టర్లు ఈ మేరకు

తరువాయి 2లో

## షేక్ హసీనా వ్యాఖ్యలతో
## మాకు సంబంధం లేదు



- షేక్ హసీనా మీడియా సమావేశంతో తమకు సంబంధం లేదన్న భారత్
- ఇది ఒక ప్రైవేట్ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమమని వెల్లడి
- బంగ్లాదేశ్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను సమర్థించబోమని రణధీర్ జైస్వాల్
- హసీనా వ్యాఖ్యలపై బంగ్లాదేశ్ ఆందోళన నేపథ్యంలో స్పందించిన కేంద్రం

2లో

## రజనీకాంత్ అర్ధాంగి కొత్త ఉద్యమం
## 'మక్కల్ మేద్రై' వెబ్‌సైట్ ప్రారంభం

- భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటమే ప్రధాన లక్ష్యం
- 'భారత్ సేవ'లో పాలుపంచుకోవాలని ప్రజలకు లతా రజనీకాంత్ పిలుపు
- గ్రామస్థాయి వరకు సంక్షేమ కార్యక్రమాలు చేర్చడమే ధ్యేయం
- దేశ చరిత్ర, గొప్పతనాన్ని యువత అర్థం చేసుకోవాలని సూచన



## ఒక దేశంపై దాడి జరిగితే
## మూడుదేశాలపై దాడి జరిగినట్టే

పాక్, సౌదీ, టర్కీ మధ్య చారిత్రక ఒప్పందం

- ఒక దేశం పై దాడి జరిగితే ముగ్గురిపై జరిగినట్టుగా భావించేలా నిబంధన
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నడుమ కీలక పరిణామం
- మూడు ప్రధాన సున్నీ ముస్లిం దేశాల మధ్య బలపడుతున్న సైనిక బంధం
- అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకునే వ్యూహంలో భాగంగా ఈ ఒప్పందం

2లో



# 'ఇలాగైతే కుబేరుడూ కూలికి వెళ్తాడు'

హైదరాబాద్: కూర్చుంటే సొమ్ము.. నిలుచుంటే సొమ్ము.. ఎలా పడితే అలా పరిమితికి మించి అమలు చేస్తున్న ఉచిత పథకాలతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇన్ని ఉచిత పథకాలు అమలు చేస్తూ పోతే కుబేరుడైనా పనికి ఆహారం వంటి పథకం కింద కూలి పనికి వెళ్తాడని... ఆ ఖాతా పేరూ 'కుబేర' అని వ్యాఖ్యానించింది. కంటోన్మెంట్ బోర్డుకు రూ.33.42 కోట్లు విడుదల చేయాలని 2024లో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలంటూ ఇచ్చిన వినతిపత్రాలపై చర్యలు తీసుకోకపోవడంతో కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు జె.రామకృష్ణ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం విచారణ చేపట్టారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా వ్యక్తిగతంగా హాజరై రూ.24 కోట్లు గత మే నెలలో చెల్లించామని, మిగిలినది వాయిదాల పద్ధతిలో ఆరు నెలల్లో చెల్లిస్తామని చెప్పారు. ఈ దశలో పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చి రెండేళ్లయినా సొమ్ము చెల్లించలేదన్నారు. ఈ దశలో న్యాయమూర్తి స్పందిస్తూ "అధికారులు ఏం చేయగలరు? మనకు వచ్చే ఆదాయమెంత. ఖర్చెంత? రాష్ట్ర బడ్జెట్‌లో జీతాలు, అప్పులకూ పోను.. మిగిలినదంతా సంక్షేమ పథకాలకే వెచ్చించే పరిస్థితి. లబ్ధిదారులు బైక్, ఐఫోన్‌తో ఉచిత బియ్యం కోసం వెళుతున్నారు. కోటీశ్వరులకూ రైతుబంధు ఇవ్వడమేంటి? ప్రభుత్వంపై ఎంత భారం పడుతోంది? భవిష్యత్తులో పిల్లలకు ఏం మిగులుతుంది" అని ప్రశ్నించారు.

**ఒక్క తెల్లకార్డునైనా తొలగించగలరా?**

రాష్ట్రంలో ఇన్ని ఉచిత పథకాల అమలుపై న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.. "ఒక తెల్లకార్డునైనా తొలగించగలరా? అలా తొలగిస్తే అదో రాజకీయమవుతుంది. ప్రభుత్వ శాఖాపరమైన వ్యవహారాల్లో ఒక్కో అధికారిపై 3 నుంచి 4 వేల కేసులున్నాయి. ప్రస్తుత అధికారిపై 100కు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏ అధికారైనా ఏమీ చేయలేరు. రేపు మీరే ముఖ్యమంత్రి అయినా ఏమీ చేయలేని పరిస్థితి. ఇది రాజకీయ ఉపన్యాసం కాదు. ఆవేదనతో చెబుతున్నా. అప్పులు తీర్చడానికి ప్రభుత్వ భూములను విక్రయిస్తుంటే భవిష్యత్తు తరాల పరిస్థితి ఏమిటి? అప్పు చేసి ఎవరైనా బెంజ్ కారు కొంటారా, ఎర్రబస్సులో వెళ్లే వాళ్లం.. ఎయిర్‌బస్‌లో వెళతామంటే ఆ కుటుంబం ఎంత కాలం నిలబడుతుంది? రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలుంటే 1.03 కోట్ల కుటుంబాలకు ఉచిత పథకాలు అందిస్తున్నారు. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇది దీర్ఘకాలం ఆచరణ సాధ్యం కాదు. సమాజం ప్రమాదంలో పడబోతోంది. ఇవన్నీ ఎంతవరకు సాధ్యమో ప్రభుత్వాలే తెలుసుకోవాలి" అని న్యాయమూర్తి అన్నారు. ప్రస్తుత కేసులో చెల్లింపులకు సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని చెబుతూ విచారణను 19కి వాయిదా వేశారు.

## భయపడొద్దు, నేనున్నాను.. టీఎంసీ శివసేన రెబల్స్‌కు ప్రధాని భరోసా

(మొదటిపేజీ తరువాయి)

కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. "ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

## దేశంలో అత్యుత్తమ జోన్‌గా విశాఖ జోన్.. రూ.2,493 కోట్ల ఆదాయంతో రికార్డు

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన సౌత్ కోస్ట్ రైల్వే (SCoR) జోన్ అతిస్వల్ప కాలంలోనే రికార్డు స్థాయి పురోగతి సాధించి, వార్షికంగా రూ.2,493 కోట్ల రాబడితో దేశంలోనే అత్యుత్తమ జోన్‌గా నిలిచిందని కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రూ.54,000 కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, మరో రూ.71,000 కోట్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయని పేర్కొంది. విశాఖ రైల్వే యార్డ్ ఆధునికీకరణ కోసం రూ.300 కోట్లు కేటాయించామని, అందులో భాగంగా 6 కొత్త ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి రానున్నాయని స్పష్టం చేసింది. అలాగే గుంతకల్ బళ్లారి నాలుగు లైన్ల విస్తరణకు రూ.1,205 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రం తెలిపింది. రైళ్ల భద్రత కోసం 100 ఇంజిన్లలో 'కవచ్' వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపింది. ఏపీ వ్యాప్తంగా 300కు పైగా ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం, అమృత్ భారత్ కింద 70కి పైగా స్టేషన్ల అభివృద్ధి, విజయవాడలో స్లీపింగ్ పాడ్స్, రాబోయే గోదావరి పుష్కరాల ముందస్తు ఏర్పాట్లతో రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను వేగంగా ఆధునీకరిస్తున్నట్లు వివరించింది.

## కేరళలో భారీ వర్షాలు.. 8 జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవు

(మొదటిపేజీ తరువాయి)

మూసివేత ఆదేశాలు జారీ చేశారు. ఈ సెలవుతో పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్యా సంస్థలు, అంగన్‌వాడీలు, ట్యూషన్ సెంటర్లు, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లతో సహా అన్నీ మూతపడ్డాయి. అయితే, ముందుగా నిర్ణయించిన పబ్లిక్, యూనివర్సిటీ పరీక్షలు, ఇంటర్వ్యూలు యథావిధిగా జరిగినట్టు తెలుస్తోంది. వయనాడ్, కన్నూర్ జిల్లాల్లోని రెసిడెన్షియల్ సంస్థలకు కొన్ని మినహాయింపులు ఇచ్చినప్పటికీ, విద్యార్థుల భద్రతకు సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐఎండీ పలు జిల్లాలకు ఆరెంజ్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. పత్తనంతిట్ట, కొట్టాయం, ఇడుక్కి, వయనాడ్ సహా ఎనిమిది జిల్లాల్లో 24 గంటల్లో 115.6 మి.మీ నుంచి 204.4 మి.మీ వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు, భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం కూడా తిరువనంతపురం, కొల్లాం, అలప్పుజ తీరాల్లో 'కల్లక్కడల్' (ఉవ్వెత్తున ఎగిసిపడే అలలు) ముప్పు ఉందని హెచ్చరించింది. మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించింది. ఆగస్టు మొదటి వారంలో కురిసిన కుండపోత వర్షాలకు రాష్ట్రంలో వరదలు సంభవించి, కొండచరియలు విరిగిపడటంతో సుమారు 11,000 మందికి పైగా ప్రజలు ప్రభావితమయ్యారు. ఐఎండీ గణాంకాల ప్రకారం ఆగస్టు 1 నుంచి 3వ తేదీ మధ్య కేరళలో సగటు వర్షపాతం 184.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఇక్కడ సాధారణంగా కురిసే 55.4 మిల్లీమీటర్ల వర్షపాతం కంటే ఇది 232 శాతం అధికం. ఈ పరిణామాల దృష్ట్యా యంత్రాంగం

## రజనీకాంత్ అర్ధాంగి కొత్త ఉద్యమం 'మక్కల్ మేడై' వెబ్‌సైట్ ప్రారంభం

ప్రముఖ సినీ నిర్మాత, విద్యావేత్త, సూపర్ స్టార్ రజినీకాంత్ సతీమణి లతా రజినీకాంత్ శుక్రవారం ఒక కొత్త సామాజిక ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 'భారత్ సేవ', శ్రీ దయా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మక్కల్ మేడై' పేరుతో రూపొందించిన వెబ్‌సైట్‌ను ఆమె అధికారికంగా ప్రారంభించారు. భారతదేశ ఘనమైన గతాన్ని, సంస్కృతిని పరిరక్షించడమే లక్ష్యంగా ఈ పౌర భాగస్వామ్య ఉద్యమాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా లతా రజినీకాంత్ మాట్లాడుతూ, "ఏళ్ల తరబడి సామాజిక రంగంలో అనేక అంశాలపై పనిచేసిన అనుభవంతో, ఇప్పుడు 'భారత్ సేవ మక్కల్ మేడై' వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్నాం. మా లోగో, బ్యానర్లు, సభ్యత్వ కార్డులను కూడా ఆవిష్కరించడం సంతోషంగా ఉంది" అని అన్నారు. ఇది ప్రజల ఉద్యమమని, దేశ సంక్షేమం కోసం ప్రజలందరూ 'భారత్ సేవ'లో చేరాలని ఆమె విజ్ఞప్తి చేశారు. "ప్రజలందరూ తమ ఆలోచనలను, చేతలను ఏకం చేసి దేశభక్తిని పెంపొందించాలి. మన దేశ చరిత్రను, దాని కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల ఆశయాలను నిలబెట్టాలి" అని ఆమె పిలుపునిచ్చారు. ఈ వెబ్‌సైట్ ప్రధాన ఉద్దేశం దేశ ప్రజల ఆలోచనలను, సంస్కృతిని పరిరక్షించడం, దేశ ఉమ్మడి ప్రయోజనాల కోసం అందరినీ ఒకేతాటిపైకి తీసుకురావడమని లతా రజినీకాంత్ వివరించారు. "భారత్ సేవ అనేది ఒక జాతీయ ఉద్యమం. ఇందులో భాగంగా తమిళనాడులో 'మక్కల్ మేడై' నమూనాను అమలు చేస్తున్నాం. ప్రతి జిల్లా, గ్రామంలో సభలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు గ్రామాల్లోని చివరి పౌరుడికి కూడా చేరేలా చూస్తాం" అని ఆమె స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యమ ప్రభావంపై మాట్లాడుతూ.. రైతులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, వ్యాపారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అంతేకాకుండా, భారతదేశ ప్రాచీన చరిత్ర, సంస్కృతి, వారసత్వం గురించి యువత తప్పనిసరిగా తెలుసుకోవాలని ఆమె సూచించారు. "మన దేశ సంస్కృతిని కాపాడటానికి ఎందరో మహానుభావులు తమ జీవితాలను త్యాగం చేశారు. నేడు మనం అనుభవిస్తున్న వైభవానికి ప్రాచీన రాజులు చేసిన సేవలను, వారి గొప్పతనాన్ని యువత అర్థం చేసుకోవాలి" అని ఆమె పేర్కొన్నారు.

## ఒక దేశంపై దాడి జరిగితే మూడుదేశాలపై దాడి జరిగినట్టే

పశ్చిమాసియా భౌగోళిక రాజకీయాల్లో ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. , పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు శుక్రవారం పవిత్ర మక్కా నగరంలో 'మక్కా ఉమ్మడి రక్షణ ఒప్పందం'పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం, ఈ మూడు దేశాల్లో ఏ ఒక్కదానిపై సాయుధ దాడి జరిగినా, దానిని మూడు దేశాలపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. సామూహిక రక్షణను బలోపేతం చేయడం, సైనిక సహకారాన్ని మరింత లోతుగా విస్తరించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. ఈ ఒప్పందంలో భాగంగా ఉమ్మడి సైనిక విన్యాసాలు, శిక్షణ కార్యక్రమాలు, రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, గూఢచార సమాచార మార్పిడి వంటి అంశాలు ఉన్నాయి. అయితే ఇది పూర్తిగా రక్షణాత్మక ఒప్పందమని, ఏ ఒక్క దేశానికీ వ్యతిరేకం కాదని టర్కీ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ కూటమిలో చేరాలనుకునే ఇతర ప్రాంతీయ భాగస్వాములకు తలుపులు తెరిచే ఉంటాయని, ఈ ఒప్పందం వల్ల టర్కీ నాటో సభ్యత్వం వంటి ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక, బహుపాక్షిక ఒప్పందాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన వివరించారు. మక్కాలో జరిగిన ఈ ఒప్పందంపై సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంతకాలు చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఉమ్రా చేసేందుకు సౌదీ వచ్చిన షరీఫ్, ఈ ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ కూడా హాజరు కావడం గమనార్హం. దాదాపు ఏడాది కాలంగా జరుగుతున్న చర్చల ఫలితంగా ఈ ఒప్పందం రూపుదిద్దుకుంది. 2025 సెప్టెంబర్‌లో పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య జరిగిన వ్యూహాత్మక ఒప్పందానికి ఇది కొనసాగింపుగా భావిస్తున్నారు. ఈ మూడు దేశాల మధ్య దశాబ్దాలుగా బలమైన సైనిక సంబంధాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో ఇరాన్, దాని మిత్రపక్షాలైన హూతీలు, ఇరాకీ మిలీషియాల నుంచి సౌదీ, ఇతర గల్ఫ్ దేశాలపై క్షిపణి, డ్రోన్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఒప్పందం ప్రాధాన్యత సంతరించుకుంది. హర్మూజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో ఇంధన రవాణాకు ఆటంకాలు, ఇజ్రాయెల్‌గాజాలెబనాన్ ఉద్రిక్తతల నడుమ తమ భద్రతను పటిష్ఠం చేసుకునేందుకు ఈ దేశాలు ఏకమయ్యాయి. ముఖ్యంగా రక్షణ భాగస్వామ్యం కోసం కేవలం అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న సౌదీ అరేబియా దీర్ఘకాలిక వ్యూహంలో ఇది ఒక కీలక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ కూటమిలోని మూడు దేశాలకు ప్రత్యేక బలాలు ఉన్నాయి. సౌదీ అరేబియాకు అపారమైన చమురు సంపద, ఇస్లాం పవిత్ర స్థలాలకు సంరక్షకుడిగా హోదా ఉంది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఏకైక ముస్లిం మెజారిటీ దేశం కాగా, టర్కీ నాటోలో రెండవ అతిపెద్ద సైన్యం, వేగంగా అభివృద్ధి చెందుతున్న రక్షణ పరిశ్రమను కలిగి ఉంది. మూడు ప్రధాన సున్నీ ముస్లిం దేశాలు భద్రతాపరంగా ఏకం కావడం

## షేక్ హసీనా వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు: భారత్ స్పష్టీకరణ

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఇటీవల నిర్వహించిన వర్చువల్ మీడియా సమావేశంతో తమకు ఎటువంటి సంబంధం లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఆ కార్యక్రమంలో, ముఖ్యంగా ఢాకాలోని ప్రస్తుత ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను తాము సమర్థించబోమని భారత్ తేల్చిచెప్పింది. న్యూఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఈ విషయాలను వెల్లడించారు. బుధవారం జరిగిన సదరు కార్యక్రమాన్ని ఒక ప్రైవేట్ మీడియా సంస్థ నిర్వహించిందని, ఇందులో భారత ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. "బంగ్లాదేశ్‌లో చట్టబద్ధంగా ఏర్పాటైన ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను మేము ఏమాత్రం సమర్థించం" అని జైస్వాల్ పేర్కొన్నారు. బుధవారం న్యూఢిల్లీ నుంచి ఆడియో లింక్ ద్వారా నిర్వహించిన సమావేశంలో షేక్ హసీనా ప్రసంగించారు. బంగ్లాదేశ్‌లో గత రెండేళ్లుగా పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని, ప్రజలు భయం, అభద్రత, ఆర్థిక ఇబ్బందుల మధ్య జీవిస్తున్నారని ఆమె ఆరోపించారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ రిగ్గింగ్ ద్వారా అధికారంలోకి వచ్చిందని విమర్శించిన ఆమె, ఈ ఏడాది చివరి నాటికి తాను తిరిగి బంగ్లాదేశ్‌కు వెళతానని తెలిపారు. షేక్ హసీనా వ్యాఖ్యలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందించింది. పొరుగు దేశాల్లోని పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని, జాతీయ భద్రతా ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని రణధీర్ జైస్వాల్ పునరుద్ఘాటించారు.

## నీట్ ప్రశ్నలు లీక్ చేసింది ఆ ముగ్గురే

న్యూఢిల్లీ : నీట్ యూజీ పేపర్ లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన విషయం విదితమే. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనంటూ న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేసిన సుదీర్ఘ పోరాటం విజయాన్ని సాధించింది. ఎట్టకేలకు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే 2026 నీట్ యూజీ పేపర్ ఎలా లీకైందన్న అంశంపై సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. 94 పేజీలతో సీబీఐ ఓ నివేదికను తయారు చేసింది. సీబీఐ ఛార్జ్‌షీట్ వివరాల ప్రకారం ... ముగ్గురు సబ్జెక్టు నిపుణులు ప్రశ్నలను కంఠస్థం చేసి, చిట్టాల మీద రాసుకుని, బుక్స్‌లో సంబంధిత పేరాగ్రాఫ్‌లను మార్క్ చేసి మరీ పేపర్ లీకేజీకి పాల్పడ్డారు.

* **క్వశ్చన్ పేపర్ల తయారీ బృందంలో ఆ ముగ్గురు**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి సంబంధించిన బృందంలోని ముగ్గరు సబ్జెక్ట్ నిపుణులు పేపర్ లీకేజీకి పాల్పడ్డారని సీబీఐ తెలిపింది. క్వశ్చన్ పేపర్లను తయారు చేసే బృందంలో ఆ ముగ్గురూ ఉన్నారనీ, పీవీ కులకర్ణి, మనీశ్ మాంధారే, మనీషా హవల్దార్.. అనే ముగ్గురు నీట్ యూజీ పేపర్ లీకేజీకి కారణమని ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిపింది. కెమిస్ట్రీ సబ్జెక్టులో కులకర్ణి నిపుణుడు. వృక్ష శాస్త్రంలో మాంధారే, భౌతిక శాస్త్రంలో హవల్దార్ నిపుణులు. నీట్ పేపర్ లీకేజీ కేసులో ఇప్పటివరకు మొత్తం 13 మంది నిందితులను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఎన్టీఏ సెంటర్‌లో ప్రశ్నాపత్రాలను తయారు చేస్తున్న సమయంలో... ఈ ముగ్గురు నిందితులు ప్రశ్నలను కాపీ చేసి వాటిని చీటీలపై రాసుకున్నారనీ, కొన్ని ప్రశ్నలను ఎన్సీఈఆర్టీ బుక్స్‌లో ఉన్న పేరాగ్రాఫ్‌ల్లో మార్క్ చేసినట్టు సీబీఐ ఛార్జ్‌షీట్ ద్వారా వివరించింది.

**డిజిటల్ వాడకుండా ...**

ఆ ముగ్గురు నిందితులకు ఎన్టీఏలో క్వశ్చన్ సెట్టింగ్, ట్రాన్స్‌లేషన్ సెక్షన్లకు యాక్సెస్ ఉందని సీబీఐ ఛార్జ్‌షీట్ ద్వారా తెలిసింది. ఎన్టీఏ సెంటర్ నుంచి సేకరించిన సమాచారాన్ని నమ్మకమైన వ్యక్తులు, కోచింగ్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు చేరేలా చేశారనీ, అయితే ఈ ప్రక్రియ డిజిటల్ విధానాలను వాడకుండా .. నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేశారని తెలిపింది. ఆర్థికంగా లాభపడేందుకు, ట్యూషన్ విద్యార్థుల్లో సక్సెస్ రేటును పెంచేందుకు నిందితులు ఇలా చేశారని సీబీఐ పేర్కొన్నది. ప్రయివేటు కోచింగ్ సెషన్స్ సందర్భాల్లో లీక్ చేసిన ప్రశ్నలను విద్యార్థులతో రాయించారని, వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించినట్టు కూడా సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో తెలిపింది. తేలికైన ప్రశ్నలను కంఠస్తం చేసి, ఆ తర్వాత తమ హోటల్ రూమ్‌లో వాటిని పేపర్‌పై రాసుకునేవారని ఛార్జ్‌షీట్‌లో సీబీఐ అధికారులు తెలిపారు.

## తిరుమల ఘాట్ రోడ్డులో కారు ప్రమాదం.. ఒకరి మృతి



తిరుమల: తిరుమలలో రోడ్డు ప్రమాదం జరిగింది. మొదటి ఘాట్ రోడ్డులో కారు అదుపుతప్పి పిట్టగోడను ఢీకొని 15 అడుగుల ఎత్తు నుంచి కింద పడిపోయింది. 22వ మలుపు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. బెంగళూరులోని గోట్టిగేరికి చెందిన సతీశ్ కుమార్ (72) తన కుటుంబసభ్యులతో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. తిరిగి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. సతీశ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా.. కుమారుడు సాయి శ్రీనివాస్, కుమార్తె సింధు ఉడత్, మనవరాళ్లు తియా, నైరాకు స్వల్ప గాయాలయ్యాయి. సతీశ్‌కుమార్ చికిత్స పొందుతూ మృతిచెందారు.

# ఆగస్టు 15న ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

*** రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు**




ప్రజాస్ఫూర్తి , భైంసా : ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వన మహోత్సవం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, వ్యవసాయ రంగం, నీటి వినియోగం తదితర అంశాలపై రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆగస్టు 15న రాష్ట్ర వ్యాప్తంగా 1 కోటి 6 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాల్లో పంపిణీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పంట మార్పిడి విధానాల అమలు ద్వారా రైతులు నష్టాలను నివారించడంతో పాటు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులకు పంటల వైవిధ్యంపై అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. భూగర్భ జలాల పెంపు కోసం చేపట్టిన పంట కుంటల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, సాగు ప్రణాళికలపై స్పష్టమైన సమాచారం అందించేందుకు గ్రామ స్థాయిలో ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, సమావేశం అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు.వన మహోత్సవం లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడంతో పాటు నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్ఓ రాథోడ్ రమేష్, డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, డీఈఓ భోజన్న, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మోటార్ వర్కర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**: ఐఎఫ్‌టీయూ**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రంలోని 35 లక్షల మంది మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు తోడేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కోటేశ్వరరావును శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన వారికి రూ.10 లక్షల, ఇల్లు లేని కార్మికులకు ప్రభుత్వ పరంగా ఇంటిస్థలం ఇవ్వాలని కోరారు. ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని, ఆర్టీసీలోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మోహన్ రావు, జిల్లా అధ్యక్షులు మోత్కూరి మల్లికార్జునరావు, నాయకులు రేసు అంజయ్య, మారుతి రావు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ ప్రచార జాతాను జయప్రదం చేయాలి

**: పల్లె శేఖర్ రెడ్డి**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలన విధానాలకు నిరసనగా ఈ నెల 6వ తేదీ నుంచి 14వరకు నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాతను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి హాజరై మాట్లాడారు. సీపీఐ ప్రచార జాత ఈనెల 14వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ నెల 9వ తేదీన ప్రచార జాత చౌటుప్పల్ పట్టణానికి చేరుకుంటుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఉడుత రామలింగం, బద్దుల సుధాకర్, బోయిన యాదయ్య, టంగుటూరి రాములు, రోషనగారి అంజయ్య, కుంటి పాపయ్య, సింగపంగ బుచ్చయ్య, నీల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండలో ఘనంగా కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలు



వలిగొండ,ప్రజాస్ఫూర్తి : భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కూతురు కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ నాయకుడు బత్తిని నాగేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు మెయిన్ రోడ్డు పక్కన పెద్ద ఎత్తున కుంభం కీర్తి రెడ్డి ఫ్లెక్సీని ఏర్పాటు చేసి కేకు కట్ చేసిన అనంతరం ప్రజలకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా నగేష్ గౌడ్ మాట్లాడుతూ యువ నాయకురాలు కీర్తి రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు ఎల్లప్పుడు జరుపుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశంసత్తిరెడ్డి, వలిగొండ సింగల్ విండో చైర్మన్ గరిసె రవి, వైస్ చైర్మన్ జంగారెడ్డి, వలిగొండ ఉప సర్పంచ్ మలుగ మాధవి వెంకటేష్ ,నాయకులు పలుసం సతీష్ గౌడ్ ,కొండూరు భాస్కర్, గంగాపురం సతీష్ గౌడ్, సామ రామ్ రెడ్డి,వలిగొండ పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు, గంగ దారి రాములు, బత్తిని లింగయ్య ,పబ్బు సురేందర్, కాసుల వెంకన్న,కొండూరు సాయి, ఎమ్మె లింగస్వామి రాపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట పట్టణ అభివృద్ధే ధ్యేయం

*** వెనుకబడిన వార్డులపై దృష్టి**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణ అభివృద్ధే ధ్యేయం గా పనిచేస్తామని వెనుకబడిన వార్డులపై దృష్టి పెట్టి సమన్వయంతో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని 25 వ వార్డు కౌన్సిలర్ కోడి శిరీష శివ వార్డులోని ముత్యాలమ్మ గుడి సమీపంలో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధుల ద్వారా మంజూరైన ఐదు లక్షల రూపాయల వ్యయంతో సీసీ డ్రైన్ కల్వర్టుల నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ తో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈనెల 15 లోపు నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, మున్సిపల్ కౌన్సిలర్లు నాగుల వాసు, గుణగంటి హేమ సతీష్, కొణతం రాజేష్ రెడ్డి, పాలగాని మాధవి కృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్,తంగేళ్ల కరుణాకర్ రెడ్డి,అబ్దుల్ రహీం,ఆలేటి మాణిక్యం,వల్దాసు దేవేందర్, నాగెల్లి అరుణ్ కుమార్, నరేందర్ నాయుడు, పడిదల రవి, యాట వెంకన్న, ఖమ్మంపాటి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన విట్యాల నరసింహకు ఘన సన్మానం

*** ఫరూఖ్‌నగర్ మండల బీజేపీ అధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో వేడుకలు**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా రూరల్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన విట్యాల నరసింహను ఫరూఖ్‌నగర్ మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు పిట్టల సురేష్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు పిట్టల సురేష్ మాట్లాడుతూ... నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విట్యాల నరసింహ ఎస్సీ మోర్చా బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా రూరల్ అధ్యక్షుడు విట్యాల నరసింహ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రాముఖ్యతపై, ఎస్ఐఆర్ అంశంపై నాయకులకు, కార్యకర్తలకు సమగ్రంగా వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రఘు గౌడ్, ఎస్సీ మోర్చా కార్యదర్శి సనుగోముల శివకుమార్, పార్టీ నాయకులు నరేష్, రమేష్, దరంపాల్ సింగ్, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేసుకోవాలి

*** తెలంగాణ రాష్ట్ర హెచ్ఐవీ, ఎయిడ్స్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జయలక్ష్మి**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : తెలంగాణ రాష్ట్ర హెచ్ఐవీ/ఎయిడ్స్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జయలక్ష్మి శుక్రవారం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ ను పరిశీలించి, హెచ్ఐవీ పరీక్షల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, రోగులకు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలో తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలని, పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచాలని సూచించారు. హెచ్ఐవీ సోకిన గర్భిణులకు సకాలంలో చికిత్స అందిస్తే తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు.ల్యాబ్‌లో జరుగుతున్న పరీక్షల విధానాన్ని పరిశీలించిన ఆమె, ల్యాబ్ టెక్నీషియన్లతో మాట్లాడి పరీక్షల నిర్వహణ, నివేదికల జారీ విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఐసీటీసీ కౌన్సిలర్ శ్యామ్ నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, నెలవారీ కన్సాలిడేషన్ నివేదికలను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తులతో మాట్లాడిన డాక్టర్ జయలక్ష్మి, వారికి ప్రతి నెలా యాంటీ రెట్రోవైరల్ మందులు నిరంతరంగా అందేలా చూడాలని సూచించారు. అన్ని రికార్డులను ఆఫ్‌లైన్‌తో పాటు హెచ్ఐఎంఎస్ పోర్టల్‌లో కూడా సక్రమంగా నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి హెచ్ఐవీ పరీక్షలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, రంగారెడ్డి జిల్లా హెచ్ఐవీ ప్రోగ్రామ్ మేనేజర్ నరేందర్, సూపర్‌వైజర్ రమేష్, ఐసీటీసీ కౌన్సిలర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కుంభం సొంత నిధులతో గుర్రపు డెక్క ఆకు తొలగింపు



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : భీమ లింగం కాలువ వెంట గుర్రపు డెక్క ఆకును హిటాచి యంత్రం ద్వారా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్వంతనిధులతో తొలగిస్తున్నారు. వలిగొండ చెరువు నుండి మొదలుకొని మల్లెపల్లి వెలవర్తి మొగిలిపాక మీదుగా ముద్దపురం వరకు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కె ఆకును తొలగించేందుకు శుక్రవారం శ్రీకారం చుట్టారు భీమలింగం కాలువ పరిధిలోని రైతులు గుర్రపు డెక్క ఆకుతో దిగువ ప్రాంత రైతులకు సాగునీరు సక్రమంగా అందడం లేదని ఆకును తొలగిస్తేనే సాగునీరు అందుతుందని ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిని కలిసి ఆకును తొలగించాలని కోరడం తో ఆయన వెంటనే స్పందించి తొలగింపు చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం వలిగొండ చెరువు వద్ద ఎమ్మెల్యే ఆదేశాలతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ ఆధ్వర్యంలో హిటాచి వద్ద కొబ్బరికాయ కొట్టి ఆకుల తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు ఈ ఆకు తొలగింపుతో దిగువ ప్రాంత రైతులకు సాగునీరంది బీడు పడిన భూములు సశశ్యామలం కానున్నాయి ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్, పాపిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గరిసె రవి, వైస్ చైర్మన్ జంగారెడ్డి ,నాయకులు పలుసం సతీష్‌గౌడ్, గంగాపురం సతీష్ గౌడ్, కంచనపల్లి ముద్దాపురం గ్రామాల సర్పంచులు రేస్ బుచ్చిరెడ్డి, సామ రామ్ రెడ్డి, బత్తిని లింగయ్య ,పబ్బు సురేందర్ గౌడ్ ,కాసుల వెంకన్న గౌడ్, కొండూరు సాయి ,చిలుకూరు సత్తిరెడ్డి, రైతులు పాల్గొన్నారు

## ఘనంగా శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో బోనాల వేడుకలు

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ డివిజన్ సంజీవయ్య నగర్ లోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో బోనాల పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి, జె. విజయ్ గుప్త, పెంటని ఉమామహేశ్వర్, జూలూరి వీరేందర్ గుప్త, దాస్, కనకయ్య, క్రిష్ణ చారి, గంగాధర్, విజయ్, శ్రీధర్, దుర్గా పతి, రాజు, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, రాకేష్ జాలిగం, అజయ్, సిద్దులు, నసీరుద్దీన్, నగేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన ఫిజియోథెరపీ సేవలు అందించడమే లక్ష్యం

*** మౌలానా హసనుద్దీన్ సాబ్**




ప్రజాస్ఫూర్తి , నల్లగొండ : పట్టణ ప్రజలకు నాణ్యమైన, ఆధునిక ఫిజియోథెరపీ సేవలు అందించాలనే లక్ష్యంతో డా. బరీరా తన్వీమా (ఫిజియోథెరపిస్ట్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోసీ ఫిజియోథెరపీ క్లినిక్‌ను మౌలానా హసనుద్దీన్ సాబ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అధునాతన ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి రావడంఅభినందనీయమని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిపుణుల సేవలతో ఏర్పాటు చేసిన ఈ క్లినిక్ పట్టణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరై డా. బరీరా తన్వీమాకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బషీర్ మౌలానా సాబ్, మాజీ కౌన్సిలర్ హాసన్ సాబ్, అక్బరుద్దీన్ సాబ్, జిల్లా హజ్ కమిటీ కార్యదర్శి అబ్జలుద్దీన్ సాబ్, ఎం.కే. సిద్ధిర్, అమీనుద్దీన్, జిల్లా హజ్ కమిటీ కార్యదర్శి ఎల్.వి. యాదవ్, టౌన్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ టీడీపీ గుండు వెంకటేశ్వర్లు, టౌన్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

*** యునైటెడ్ దళిత క్రిస్టియన్స్ ఫెడరేషన్ డిమాండ్**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని యునైటెడ్ దళిత క్రిస్టియన్స్ ఫెడరేషన్ (యూడీసీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నల్లగొండ పట్టణంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో యూడీసీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఫెడరేషన్ అధ్యక్షుడిగా డి. ఐ. సామ్సన్, ఉపాధ్యక్షుడిగా జేపీ సాల్మన్ రాజు, ప్రధాన సలహాదారుగా డాక్టర్ ప్రధాన కార్యదర్శిగా పి. డేవిడ్ రాజు, నిర్వహణ కార్యదర్శిగా డి. ఎవినేజర్, సలహాదారుగా పి. జేమ్స్, కోశాధికారిగా ఆదిమల్ల ప్రభుదాసు ఎన్నికయ్యారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నలుమూలల నుంచి పాస్టర్లు, సంఘ పెద్దలు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు, పాస్టర్లు, సంఘ పెద్దలు, పలువురు వక్తలు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే దేశవ్యాప్తంగా దళిత క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టి, వారికి రాజ్యాంగబద్ధమైన హక్కులు, రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మధురపురంలో భక్తిశ్రద్ధలతో బోనాల జాతర



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఫరూఖ్ నగర్ మండలం మధురపురం గ్రామంలో బోనాల పండుగ జాతర మహోత్సవం ఆధ్యాత్మిక ఉత్సాహంతో, అత్యంత వైభవంగా సాగింది. గత రెండు రోజులుగా గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు శివారెడ్డి, షాద్నగర్ నియోజకవర్గ ఉపసర్పంచుల సంఘం అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆషాడ మాస వేడుకల్లో భాగంగా గ్రామంలోని శ్రీ మైసమ్మ, పోచమ్మ అమ్మవార్లకు గ్రామ మహిళలు, భక్తులు కుండలలో నైవేద్యాలను పేర్చి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఉదయం నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మంగళవాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, నిశా క్రాంతి, పూజ శివసత్తుల పూనకాల నడుమ మహిళలు బోనాలను తలపై ధరించి ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు చేరుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వేళల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, తీన్మార్ నృత్యాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో గ్రామ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ చేనేత దినోత్సవంలో వలిగొండ విద్యార్థుల ప్రతిభ



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన మరియు ఉపన్యాస పోటీలలో శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వలిగొండ పదవ తరగతి విద్యార్థిని కుమారి బెలిదె అన్విత మరియు తొమ్మిదవ తరగతి విద్యార్థి బెలిదె వర్ధన్ లు ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతిని గెలుచుకొని స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి , కలెక్టర్ అనురాగ్ జయంతి గారి మరియు ఇతర పెద్దల చేతుల మీదుగా మెమొంటో మరియు సర్టిఫికెట్ లను అందుకోవడం జరిగింది ఉత్తమ ప్రతిభ కనబరిచిన అన్విత మరియు వర్ధన్ లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకోజుభాస్కర్ ఉపాధ్యాయులు శ్రీ కొండపర్తి నవీన్ పోలేపాక నాగేందర్ సైదారెడ్డి ఎస్ఎంసి చైర్మన్ విజయలక్ష్మి మరియు ఉపాధ్యాయ బృందం అన్విత మరియు వర్ధన్ లను అభినందించి హర్షం వ్యక్తం చేశారు

# బాలల హక్కుల పరిరక్షణ పై అవగాహన




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల మండలం ఎస్ లింగోటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (డీసీపీయు), స్కోప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ ఎం. మత్స్యగిరి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, బాలల హక్కులు, బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. 1098, 112టోల్ ఫ్రీ నెంబర్ల ప్రాముఖ్యతను వివరించారు. గుడ్ టచ్, బాడ్ టచ్, మానసిక, శారీరక వేధింపులు ఎదురైనప్పుడు విద్యార్థినీలు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. అనంతరం విద్యార్థినీల చేత బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం టోల్ ఫ్రీ నెంబర్ వాల్ పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ పురుషోత్తం రెడ్డి, స్కోప్ సంస్థ ప్రతినిధి బి.నరసింహ రాజు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రినిటీలో బోనాల ఉత్సవాలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ హైస్కూల్ లో బోనాల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రినిటీ హై స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ బుజ్జీని ఉజ్జిని మంజుల హాజరై, మాట్లాడారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో తెలంగాణలో ఉత్సవాన్ని ప్రజలు ఘనంగా నిర్వహిస్తారు. గ్రామదేవతలకు బోనాలను నైవేద్యంగా పెట్టడం తెలంగాణ ప్రాంతంలో ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన బోనాలు అలరించాయి. విద్యార్థుల వేషధారణ పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కేవీపీ కృష్ణారావు, సమన్వయకర్తలు భార్గవి, స్వరూప, పూజా రెడ్డి, ఉపాధ్యాయులు కరుణ, మౌనిక, జ్యోతి, అరుణ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జల సంరక్షణకు ఇంకుడు గుంతలు

- దేవలమ్మ నాగారంలో జలసిరి కార్యక్రమం
- సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భూగర్భ జల సంరక్షణకు ఇంకుడు గుంతలు ఎంతగానో దోహదపడతాయని సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని మండలంలోని దేవలమ్మ నాగారం గ్రామంలో శుక్రవారం ప్రారంభించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వర్షపు నీరు భూగర్భంలోకి వెళ్లేందుకు ఇంకుడు గుంతలు దోహదపడతాయన్నారు. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు వీలుగా, నీటి మట్టాల పెంపుదలకు ఇంకుడు గుంతలు ప్రాముఖ్యత వహిస్తాయన్నారు. గ్రామంలో సాధ్యమైనంత వరకు ఇంకుడు గుంతలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ శ్వేత, బొమ్మ అమరావతి, ఫాతిమా, దోనూరి కిరణ్ రెడ్డి, పాక రాము, సుంకరి శ్రీను, దేశట్ల చైతన్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన జూనియర్ సివిల్ జడ్జిని కలిసిన ప్రభుత్వ న్యాయవాది

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టుకు నూతనంగా నియమితులైన జూనియర్ సివిల్ జడ్జి శాలిని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి శాలినిని చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నర్సింహా రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేసి, ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట న్యాయవాదులు పాల పరమేష్, శ్రీకాంత్ లు ఉన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

* రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండలం లో పర్యటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. తిప్పారెడ్డి గూడెం గ్రామంలో రూ.2.10 కోట్ల వ్యయంతో తిప్పారెడ్డిగూడెం నుండి రాకాసి తండా వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, హైదర్ సాయిపేట గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవననిర్మాణానికి, పాతర్లపాడు గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి, రాజారాం గ్రామంలో 4 కోట్ల 50 లక్షలతో రాజారాం నుండి తుమ్మగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తోందన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తిప్పారెడ్డిగూడెం గ్రామ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.35.55 కోట్లు, హైదర్ సాయిపేట గ్రామానికి రూ.37 కోట్లు, పాతర్లపాడు గ్రామానికి రూ.29.25 కోట్లు,రాజారాం గ్రామానికి రూ. 8.48 కోట్లు మంజూరు చేసి అంతర్గత సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, వంతెనలు, ఇతర మౌళిక వసతుల కల్పనకు పనులు చేపట్టినట్లు తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న పరిస్థితులను ఎవరూ మర్చిపోలేరని పేర్కొన్నారు. త్వరలో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేస్తామని, ప్రొసీడింగ్స్‌తో పాటు ఇంటి నిర్మాణ పురోగతికి అనుగుణంగా బిల్లులను కూడా విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిపిఓ వినోద్ కుమార్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆటపాటలతోనే చిన్నారులకు ఆనందదాయక అభ్యసనం

: కలెక్టర్ కె.హరిత



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: ప్రైమరీ దశ చిన్నారుల భవిష్యత్ విద్యకు పునాది వంటిదని, ఈ దశలో వారికి ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటలు, పాటలు, కథలు, సంభాషణలు, చిత్రలేఖనం తదితర కార్యకలాపాల ద్వారా అభ్యసన అవకాశాలు కల్పించాలని కలెక్టర్ కె.హరిత సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రీప్రైమరీ సెక్షన్లు నిర్వహిస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నారులు పాఠశాలకు రావడానికి ఆసక్తి చూపేలా ప్రతి పాఠశాలలో సురక్షితమైన, సంతోషకరమైన, ఆహ్లాదకరమైన అభ్యసన వాతావరణాన్ని కల్పించాలన్నారు. ప్రతి చిన్నారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి వయస్సు, ఆసక్తి, అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధనా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. "పాఠశాలలో చిన్నారి పొందే తొలి అనుభవం అతని మొత్తం విద్యా ప్రయాణంపై ప్రభావం చూపుతుంది. అందువల్ల ప్రీప్రైమరీ తరగతి గదిని పిల్లలు ప్రతిరోజూ ఆనందంగా రావాలనుకునే ప్రదేశంగా తీర్చిదిద్దాలి" అని కలెక్టర్ కె.హరిత పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్వర్, రిసోర్స్ పర్సన్లు శంకర్, ఝాన్సీ, వెంకటేష్, ప్రీప్రైమరీ సెక్షన్లు నిర్వహిస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ ఆశయాలు భావితరాలకు దిక్సూచి

* తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రజాకవి గద్దర్ ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల పిలుపునిచ్చారు. శుక్రవారం గద్దర్ 3వ వర్ధంతి సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న గద్దర్ విగ్రహ స్థలంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శివ్వన్నగారి నరసింహ చారి, ప్రధాన కార్యదర్శి బచ్చు సంగమేశ్వర్‌లను డాక్టర్ గుమ్మడి వెన్నెల శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలు, అణగారిన ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి చెవిటి అశోక్, సీనియర్ జర్నలిస్టులు, మెదక్ ప్రెస్ క్లబ్ సభ్యులు బాలేశ్వర్ రావు, శంకర్ దయాళ్ చారి, బొందుగుల నాగరాజు, ఫారుక్ హుస్సేన్, చింతల రమేష్, నర్సింలు, చల్ల రాహుల్, దౌలయ్య, సిద్దేశం, సుబ్బు,లక్ష్మణ్, శ్రీహరి, కృష్ణమూర్తి, కార్తీక్, శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు గంట సంపత్, జుబేర్, అస్తరు గల్లా బాల్‌రాజు, మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మల మైసయ్య, ఆకుల పెంటయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంగాధర్, కాంగ్రెస్ నాయకుడు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, బీఎస్పీ నాయకులు, దళిత ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# కూచనపల్లి–మాలపల్లి వంతెనకు రూ.3 కోట్ల నిధులు మంజూరు

* కూచనపల్లి గ్రామ సర్పంచ్. మడప పద్మ జైపాల్ రెడ్డి



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచనపల్లి-మాలపల్లి గ్రామాల మధ్య వాగుపై వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పాటు బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమానాలు మంజూరు చేయించడంలో గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ గ్రామ ప్రజలు ఆనందోత్సాహాలతో కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ మడప పద్మ జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మామిడి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ ఆయన చొరవతో గ్రామ ప్రజల చిరకాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మడప పద్మ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, కూచనపల్లి-మాలపల్లి గ్రామాల మధ్య వాగుపై వంతెన లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెన్నె రాజు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు కాంగ్రెస్ నాయకులు,పాల్గొన్నారు.

# ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి

* జోగిపేట మార్కెట్ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి



అందోలు, ప్రజాస్ఫూర్తి : దుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని అందోలు మండల పరిధిలోని నేరడిగుంట చౌరస్తాలో వర్తక వ్యాపారులు శుక్రవారం దుర్గమ్మ తల్లికి బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బోనాల ఊరేగింపు డప్పు చప్పుల్లు, శివసతుల పూనకాల మధ్య వైభవంగా సాగింది. బోనాల ఉత్సవాలలో పలువురు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ ఉత్సవాల ద్వారా గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని అన్నారు. దుర్గమ్మ తల్లి దయాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో తులతూగాలని, ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివరాజ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచులు లింగాగౌడ్, అశోక్, నాయకులు వైద్యనాథ్, శ్రీధర్ రెడ్డి, వర్తక వ్యాపారులు మచ్చేందర్, మల్లేశం, శంకర్,సంగన్న తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పట్టణ అధ్యక్షులుగా బూర మల్సూర్ గౌడ్



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట : బిజెపి పట్టణ అధ్యక్షులుగా బూర మల్సూర్ గౌడ్ నియమితులయ్యాలరు. ఈమేరకు బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియామకం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట పట్టణ అభివృద్ధి కోసం నిత్యం అందుబాటులో ఉంటూ కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి ఆహర్నిశలు పాటుపడతానని తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్, మాజీ శాసనసభ్యులు శానంపూడి సైదిరెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, బొబ్బ భాగ్యరెడ్డి, కవితా రెడ్డి, రాష్ట్ర నాయకులు టి, మన్మధ రెడ్డి, రంగరాజు రుక్మారావు, తోటిపల్లి రవి లకు కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళల భద్రతకు బలంగా 'సురక్ష సహచరి'

మల్కాజ్‌గిరి, ప్రజాస్ఫూర్తి : మహిళల భద్రత, సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ సమన్వయ సహకారంతో 'సురక్ష సహచరి' స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఓల్డ్ నేరేడ్మెట్ అంబేద్కర్ భవన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేరేడ్మెట్ సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాల నివారణ, మహిళలకు అందుబాటులో ఉన్న పోలీసు సేవలు, సమాజంలో మహిళల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకోగా, మహిళల రక్షణ కోసం చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు మరింత ఉపయోగకరంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

# అమ్మవారి బోనాలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

* జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్
* శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో బోనాల సందడి

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సంస్కృతికి ప్రతికగా ఆషాఢ మాసంలో జరిగే అమ్మవారి బోనాలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. ఆషాఢ మాస అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ భగత్సింగ్ మార్గ్లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో సందడి గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనాలు పెట్టుకుని పాఠశాల నుంచి అమ్మవారి ఆలయానికి పోతురాజుల నృత్యాలతో డప్పు చప్పులతో అమ్మవారికి బోనం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బోనాలను రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామన్నారు. పాఠశాల కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియపరుస్తూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోకుండ ఉండేందుకు ప్రతి యేటా అమ్మవారి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# అధికారులా.. కాంగ్రెస్ కార్యకర్తలా..?

* **బిజెపి ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ముట్టడి**
* **గంగిడి మనోహర్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఎమ్మెల్యేల సిఫారసు మేరకే నడుచుకుంటూ.. నిధుల కేటాయింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు.. ప్రభుత్వ అధికారులా.. కాంగ్రెస్ కార్యకర్తలా అని బిజెపి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగిడి మనోహర్ రెడ్డి ప్రశ్నించారు. బిజెపి సర్పంచులు, కౌన్సిలర్లకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల, సంస్థాన్ నారాయణపురం బిజెపి మండల కమిటీల ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయాన్ని శుక్రవారం బిజెపి శ్రేణులు ముట్టడించాయి. అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఉపాధి హామీ నిధులను సర్పంచులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు తంగడపల్లి రోడ్డు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించారు. బిజెపి సర్పంచులకు, కౌన్సిలర్లకు నిధులకు కేటాయింపులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్లకార్డులను చూపుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయంలోకి చొచ్చుకుపోయారు. నిధులు ఎందుకు కేటాయించడం లేదని ఆర్డీవోను ప్రశ్నించారు. వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ నిధుల విషయంలో అన్ని గ్రామ పంచాయతీలకు సమన్వయంతో నిధులు కేటాయిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ, హెచ్ఎండిఏతో పాటు వివిధ రూపాలలో వచ్చే ప్రభుత్వ నిధులు బిజెపి సర్పంచులు, కౌన్సిలర్లకు కేటాయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వివరిస్తున్నారని ఆరోపించారు. బిజెపి తరఫున ఎన్నికైన సర్పంచ్లకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. నిధులు కేటాయించాలని వెళ్తే బిజెపి తరఫున ఎన్నికైన గ్రామాలకు నిధులు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే సిఫారసుల మేరకే ఆయా గ్రామపంచాయతీలకే అధికారులు నిధులు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా నడుచుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, నాయకులు దోనూరి వీరారెడ్డి, శాగ చంద్రశేఖర్ రెడ్డి, పోతపాక లింగస్వామి, పిట్టల శ్రీనివాస్, సతీష్ యాదవ్, రాజు, పాలకూర్ల జంగయ్య, ఊడుగు యాదయ్య, గుజ్జుల సురేందర్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, రమణగోని శంకర్, బుడ్డ సురేష్, ఆలె చిరంజీవి, పోలెపల్లి లక్ష్మీ ముత్తయ్య, సుర్వి సౌజన్య రాజు, రమేష్, నందగిరి వెంకటేష్, తంగెళ్ళ వెంకటేష్, టేకుల మంజుల దిలీప్ రెడ్డి, కైరంకొండ స్వప్న అశోక్, కదారి కల్పన ఐలయ్య యాదవ్, బోయ దేవేంద్ర మణికుమార్, ఫకీర్ శ్రీనివాస్ రెడ్డి, బోయ సదానందం, బాతరాజు ధనుంజయ, వెలిజాల శ్రీను, బాతరాజు సత్యం, కాయితి రమేష్, దిండు భాస్కర్, పబ్బు వంశీ, శ్రీధర్ బాబు, ఆల్మాస్ పేట గౌతమ్, వినయ్ రెడ్డి, ముత్యాలు, మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా సహకారం మరువలేనిది

* **జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ ప్రెస్ క్లబ్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు నరసింహ చారి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, కార్యవర్గం శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. కలెక్టర్ వారికి శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా పాత్రికేయ మిత్రులు వారి సమస్యలను కలెక్టర్ కు విన్నవించడం జరిగింది. ప్రభుత్వానికి ప్రజలకు వారధిల పాత్రికేయులు పనిచేస్తారని, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర మరువలేనిదన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: వినియోగదారుల మన్ననలు పొందేలా నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీమార్ట్ పక్కన వాఫిల్ విజ్' 72వ బ్రాంచ్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడే వాఫిల్స్, బ్రౌనీస్, పాన్కేక్స్, కేక్ బౌల్స్ వంటి రుచికరమైన ఆహార పదార్థాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, స్థానిక కౌన్సిలర్ షేక్ మన్సూర్ బీ ఫారుక్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహీం, చింతమల్ల రమేష్,మొరిశెట్టి లక్ష్మాధి, గుణగంటి సతీష్, ఆలేటి మాణిక్యం, నరేందర్ నాయుడు, నిర్వాహకులు ఆసిఫ్, అబ్దుల్ సలాం, ముస్తఫా, ఆరిఫ్, అఖిల్, సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ మహోత్సవం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి కళ్యాణ మహోత్సవం ఆషాడ మాసంలో ఆడికృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని విద్యానగర్ శ్రీ రామలింగేశ్వర స్వామి త్రిశక్తి అయ్యప్ప, ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం 54 ద్రవ్యాలతో శాస్త్రోక్తకంగా ఆలయ అర్చకులు రెంటాల సతీష్ శర్మ, దాములూరి సతీష్ శర్మ, ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో అన్నదానం దాతలు మడిపెద్ది యాకయ్య, మహాభిషేకం దాతలు చల్ల లక్ష్మీకాంత్ శృతి దంపతులు, ఆలయం చైర్మన్ అనంతుల గణేష్ రామలింగయ్య, ఆలయ ధర్మకర్తలు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, శ్రీనివాస్, పెద్దిరెడ్డి భరత్, వాసా కృష్ణ, చెన్నూరి వెంకన్న, తెడ్ల ప్రభాకర్, అర్చకులు దుర్గాప్రసాద్ శర్మ, సుబ్రహ్మణ్య సేవా బృందం, భక్తులు పాల్గొన్నారు.

## న్యూ జనరేషన్ స్కూల్ లో కన్నుల పండుగలా బోనాల వేడుకలు



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను న్యూ జనరేషన్ స్కూల్ ఆవరణలో శుక్రవారం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.
ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు నెత్తిపై అలంకరించిన బోనాలను, తోట్టెలను ధరించి దుర్గామాత నామస్మరణతో పాఠశాల ఆవరణలో ఊరేగింపుగా వెళ్లారు. పోతురాజుల వేషధారణలతో, శివసత్తుల నృత్యాలు మరియు దప్పుల దరువులతో పాఠశాల ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అవుల నరసింహ రావు మాట్లాడుతూ — "విద్యార్థులకు కేవలం పుస్తక పరిజ్ఞానమే కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశం. తెలంగాణ ప్రాచీన సంస్కృతికి ఆనవాళ్లయిన ఇటువంటి పండుగలను పాఠశాలల్లో జరుపుకోవడం ద్వారా పిల్లల్లో ఆధ్యాత్మికతతో పాటు సాంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం కె.సుజాత ,సుధారాణి, శ్రీలత, స్వప్న, శిల్ప, స్వాతి, అనూష, లక్ష్మి, హలీమ, ఉపేంద్ర, మనీషా, సిబ్బంది నరేందర్, నవనీత, రాణి మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని వేడుకను జయప్రదం చేశారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులకు ప్రసాద వితరణ చేశారు.

## మల్కాజిగిరిలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : ఆరోగ్యశ్రీ పథకం అమలుకు ఎమ్మార్పీఎస్ ఉద్యమమే స్ఫూర్తి మల్కాజిగిరిలో ఘనంగా ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవ పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అమలులోకి వచ్చిన ఆరోగ్యశ్రీ పథకం వెనుక ఎమ్మార్పీఎస్ ఉద్యమాలే ప్రధాన స్ఫూర్తిగా నిలిచాయని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మల్కాజిగిరి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ పేద కుటుంబాలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో సాగిన ఉద్యమాల ఫలితంగానే ఆరోగ్యశ్రీ పథకం రూపుదిద్దుకుందని తెలిపారు. ముఖ్యంగా గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత వైద్యం అందించాలని చేపట్టిన ఉద్యమం ఈ పథకానికి బలమైన పునాదిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రన్ మాదిగ, మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రణయ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పథకం ఆవిర్భావంలో ఎమ్మార్పీఎస్ పాత్రను అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా గుర్తించి ప్రశంసించారని గుర్తు చేశారు. ఎమ్మార్పీఎస్ ప్రారంభించిన ఈ ప్రజా ఉద్యమ ఫలితమే నేడు దేశవ్యాప్తంగా అమలవుతున్న ఆయుష్మాన్ భారత్ వంటి ఆరోగ్య భద్రతా పథకాలకు దిక్సూచిగా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బంధం చెరువు,గాంధీ పార్కును సందర్శించే విధంగా అభివృద్ధి చేస్తాను



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్, బంధం చెరువును సందర్శించిన మహబూబాబాద్ శాసనసభ్యులు డా" భూక్యా మురళి నాయక్ పట్టణంలోని బంధము చెరువు, గాంధీ పార్క్ లను అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సందర్శన సమయంలో ప్రజల వినోదం,ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కోసం ఈ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ప్రధానంగా చర్చించిన అభివృద్ధి, బంధము చెరువు సుందరీకరణ చెరువు కట్టను ఆధునీకరించి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్,చిన్నారుల కోసం ప్లే ఏరియా ఏర్పాటు చేయడం.పచ్చదనం,చెరువు, పార్క్ చుట్టూ నాణ్యమైన ఎల్ఈడీ లైటింగ్ ఏర్పాటుతో పాటు విస్తృతంగా మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడం. గాంధీ పార్క్ లో సందర్శకులు కూర్చోవడానికి బెంచీలు,తాగునీటి సౌకర్యం, నిరంతర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో కుటుంబంతో కలసి హాయిగా గడిపేలా ఈ ప్రాంతాలను రూపుదిద్దాలని మురళి నాయక్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్,స్థానిక కౌన్సిలర్ చదిరాల అరుణ జ్ఞానేశ్వర్,వార్డుల కౌన్సిలర్లు పద్మ ప్రవీణ్,గాడిపెల్లి చరణ్ గౌడ్,ఎడ్ల రమేష్,నాళ్ళ నరసింహారావు,గిరిధర్ గుప్తా మున్సిపల్ సంబంధిత అధికారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జనగణన వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి




* **రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళికెరి**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జనగణన-2027 కార్యక్రమంలో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్ బుక్ తయారీకి అవసరమైన గ్రామ డైరెక్టరీ, పట్టణ డైరెక్టరీ వివరాల సేకరణను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళికెరి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మహబూబాబాద్ కలెక్టరేట్ నుండి సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర జన గణన సంచాలకులు మాట్లాడుతూ భారత ప్రభుత్వ రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర జనగణన సంచాలకుల కార్యాలయం మార్గదర్శకాల మేరకు జిల్లాల పరిధిలో అన్ని చార్జ్ల పరిధిలో ఫీల్డ్ ఫంక్షనరీలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిక్షణల ద్వారా సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో ఏకరూపత, ఖచ్చితత్వం, నాణ్యతను నిర్ధారించేందుకు సమగ్ర అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన విద్య, ఆరోగ్యం, త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు, రవాణా, బ్యాంకింగ్ సేవలు, పోస్టల్ సేవలు, వ్యవసాయం, మార్కెటింగ్ సౌకర్యాలు, సామాజిక, ఆర్థిక మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి జిల్లా జనగణన హ్యాండ్ బుక్ వెబ్ పోర్టల్లో నమోదు చేసే విధానంపై క్షేత్ర సిబ్బందికి తగు శిక్షణ అందించాలని తెలిపారు.మొబైల్ యాప్, వెబ్ పోర్టల్, అవసరమైతే భౌతిక షెడ్యూల్ ద్వారా సమాచార సేకరణ జరుగుతుందని తెలిపారు. ఛార్జ్ అధికారుల బాధ్యతలు, ఫీల్డ్ సిబ్బంది నియామకం, యూజర్ ఐడీల సృష్టి, శిక్షణ నిర్వహణ, ఫీల్డ్ వర్క్ పర్యవేక్షణ, డేటా ధృవీకరణ, గౌరవ వేతనాల పంపిణీ, నిర్ణీత గడువులో పనుల పూర్తి వంటి అంశాలు పొందుపరచబడి ఉంటాయని, డేటా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామ/పట్టణ కోడ్లు సక్రమంగా నమోదు చేయాలని, తప్పనిసరి వివరాలన్నీ నమోదు చేయాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ఇంటర్ ఇంటర్మీడియట్ అధికారి మదర్, ఇంచార్జ్ వెల్ఫర్ అధికారిని శిరీష, డిఎస్ఓ రమేష్, ఆర్ అండ్ బి, పిఆర్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, ఎల్డిఎం యాదగిరి, డిపిఓ రేవంత్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, ఆర్టీసీ డిఎం కల్యాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డబుల్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి

* **భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతికుమార్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: డబుల్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు సొల్ల క్రాంతికుమార్ అధ్యక్షతన ముస్తాబాద్ పట్టణంలో దుబ్బాక వెళ్లే రహదారి ఏర్పాటుకు మంజూరైన డబల్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ముస్తాబాద్ రహదారి గుంతల్లో వరి నాట్లు వేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతికుమార్ మాట్లాడుతూ మాటల్లో చెప్పడం కాంగ్రెస్కు అలవాటని, చేతల్లో చూపించడం బీజేపీ నాయకులకు ప్రజాక్షేత్రంలో బాధ్యత అని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా రోడ్ల పరిస్థితి అంగుళం కూడా మారలేదని మండిపడ్డారు. ప్రజలు పన్నులు కడుతోంది రోడ్లపై ప్రయాణించడానికా లేక గుంతల్లో ప్రయాణించి ప్రాణాలు కోల్పోవడానికా అని ప్రశ్నించారు. అధ్వానంగా తయారైన రోడ్లు, మోకాళ్ళ లోతు గుంతలతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న రోడ్డు గుంతల్లోనే వరి నాట్లు వేసి వినూత్నంగా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసించారు. ఈ రోడ్లు ప్రయాణానికి పనికిరావని, కేవలం పంటలు పండించుకోవడానికి మాత్రమే పనికొస్తాయని పరిపాలనా వైఫల్యాన్ని ఎండగట్టారు. రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజగౌడ్, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, మండల ప్రధాన కార్యదర్శులు ఎదునూరి గోపికృష్ణ, బుచ్చేలి మహేశ్వరి, మండల ఉపాధ్యక్షులు గుండవేణి తిరుపతి, చికోటి మహేష్, బెదుర ప్రశాంత్, మెంగని మహేందర్, కార్తీక్ రెడ్డి, చిగురు వెంకన్న, దీటి సత్యం, పున్నం అనిల్, నర్ర ప్రశాంత్, మర్గల వేణుగోపాల్, పాశం హరీష్, దగ్గు నవీన్, వినయ్, ఆకాష్, సాయి, నర్సింలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

* **జిల్లా అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్**




ప్రజా స్ఫూర్తి, భైంసా: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పంద్రాగస్టు వేడుకల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం అతిథులను ఆహ్వానించాలన్నారు. వేదికను అందంగా ముస్తాబు చేయాలన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమం జరుగుతున్నంతసేపు నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. టెంట్, షామియానా, తాగు నీరు ఏర్పాటు చేయాలని చెప్పారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వివరించారు. అంబులెన్సు అందుబాటులో ఉంచడంతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు.పార్కింగ్ ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎక్కడా కూడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖలు సమన్వయంతో, ప్రణాళిక ప్రకారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాలను ప్రోత్సహించి కార్మికుల ఆర్థికాభివృద్ధికి అండగా నిలవాలి

*** టీపీపీఎస్ జిల్లా అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు**

మహబూబాబాద్, ప్రజాస్పూర్తి : చేనేత కార్మికుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని,చేనేత కార్మికులు తమ శ్రమతో తయారు చేసే వస్త్రాలను కొనుగోలు చేసి వినియోగించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని టీపీపీఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. చేనేత రంగం బతికితేనే దానిపై ఆధారపడిన వేలాది కుటుంబాలకు జీవన భరోసా ఉంటుందని అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలోని పద్మశాలి టౌన్ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సామాజికవర్గానికి చెందిన నాయకులు, సంఘ ప్రతినిధులు, యువజన నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

*** చేనేత కార్మికుల శ్రమకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి**

ఈ సందర్భంగా చిలుకమారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చేనేత కార్మికులు తమ చేతివృత్తినే నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటూ




భారతీయ సంప్రదాయాన్ని తరతరాలుగా కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆధునిక కాలంలో యంత్రాల ద్వారా తయారయ్యే వస్త్రాలతో చేనేత రంగం తీవ్ర పోటీని ఎదుర్కొంటోందని, దీంతో అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని అన్నారు. చేనేత కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, ఆదాయం లభించాలంటే చేనేత వస్త్రాలకు మార్కెట్ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వినియోగించేందుకు ముందుకు రావాలని కోరారు. చేనేత వస్త్రాలకు ప్రజల ఆదరణ పెరిగితే కార్మికులకు నిరంతర ఉపాధి లభించడంతో పాటు వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు. చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే జీవన విధానమని అన్నారు. Lచేనేత రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వం, ప్రజలు, సామాజిక సంఘాలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

*** స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో చేనేత దినోత్సవం**

1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం ప్రారంభమైన సందర్భంగా జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వెంకటేశ్వర్లు తెలిపారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, దేశీయ కార్మికులు, చేనేత కళాకారులకు అండగా నిలవడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని అన్నారు. 2015 నుంచి జాతీయ చేనేత దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. స్వదేశీ భావనను మరింత బలోపేతం చేస్తూ స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులను ప్రజలు వినియోగించాలని పిలుపునిచ్చారు.

**సమాజ ఐక్యతతోనే హక్కుల సాధన**

సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని చిలుకమారి వెంకటేశ్వర్లు అన్నారు. సమాజానికి సంబంధించిన సమస్యలు, హక్కులు, అవసరాలపై సమష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రాతినిధ్యం కూడా ఎంతో కీలకమని అన్నారు. సమాజ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీపీఎస్ జిల్లా అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ టౌన్ అధ్యక్షుడు గద్దె రవి, గౌరవ అధ్యక్షుడు అనుముల వెంకటేశ్వర్లు, ముల్క కృష్ణమూర్తి, బొమ్మ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన అధ్యక్షుడు అనుముల సిద్ధార్థ, చలమల్ల నారాయణ, డాక్టర్ పరికిపండ్ల అశోక్, టౌన్ జనరల్ సెక్రటరీ కూరపాటి శ్రీనివాస్, రాపాక కృష్ణ, జాడల యాదగిరి, బొమ్మ వెంకటేశ్వర్లు, కూషాడి కరి మండలం అందె భాస్కర్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలు పై ఆకస్మిక దాడులు



మహబూబాబాద్, ప్రజాస్పూర్తి : మహబూబాబాద్ ఎస్పీ ఆదేశాల మేరకు మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి, రూరల్ ఎస్సై సెల్ రాజు, రవికిరణ్, కొరవి ఎస్సై సతీష్, సిబ్బందితో శనిగాపురం గ్రామ పరిధిలోని పాత తండా, బోడతండలో కార్డెన్ అండ్ సర్చ్ నిర్వహించడం జరిగింది. పలు తండాలలో ప్రభుత్వం నిషేధించిన గుడుంబా తయారు చేస్తూ అమ్ముతున్న వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగింది. సుమారు 30 లీటర్ల గుడుంబాను అదేవిధంగా 700 లీటర్ల బెల్లం పానకమును పోలీసు వారు స్వాధీన పరుచుకొని బెల్లం పానకమును అక్కడే ధ్వంసం చేయడం జరిగిందని సదరు గుడుంబా తయారుచేసే వ్యక్తులను పిఎస్ కు తీసుకొచ్చి వారిపై కేసు నమోదు చేయటం జరిగింది.

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో విద్యార్థులకు అనుమతి ఇవ్వాలి



మహబూబాబాద్, ప్రజాస్పూర్తి : భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం సందర్భంగా ఆగస్టు 10 నుండి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగరవేసి దేశభక్తిని చాటే కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా విద్యార్థుల్లో దేశభక్తిని, జాతీయ జెండాపై గౌరవాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో పాఠశాల విద్యార్థులను కార్యక్రమానికి తీసుకువెళ్లి, జాతీయ పతాకంతో సెల్ఫీలు తీయడబడును,"హర్ ఘర్ తిరంగా" పోర్టల్లో అప్లోడ్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించదలచాము. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనేందుకు అవసరమైన అనుమతిని మంజూరు చేయవలసిందిగా గుగులోతు సురేష్ నాయక్, ఎస్టీ మోర్చా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు. మహబూబాబాద్ ఆర్డీఓ ను కోరడమైనది. వెంటనే స్పందించి అనుమతి ఇస్తానని హామీ ఇచ్చారు.

# కోటి రూపాయల నిధులను అభివృద్ధి పనులకు సద్వినియోగం చేసుకోవాలి

*** డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ**



ప్రజాస్పూర్తి, కొత్తగూడెం : గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) అమలులో భాగంగా డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ శుక్రవారం గౌతమ్‌పూర్ గ్రామ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి షర్మిల, సర్పంచ్ కళ్యాణికి పలు సూచనలు చేశారు. గ్రామపంచాయతీలో జీపీడీపీ జీపీ షాప్, ఎన్ఆర్ఈజీఎస్ నిబంధనలను ఎలా అమలు చేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బీజీజీ రిజిస్టర్లు, సంబంధిత రికార్డులను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో అవార్డు విన్నర్ గ్రామపంచాయతీగా గౌతమ్‌పూర్‌కు లభించిన కోటి రూపాయల నిధులను గ్రామ అభివృద్ధి పనులకు వినియోగించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. జీపీడీపీకి సంబంధించి ప్రత్యేక సర్వే నిర్వహించి గ్రామ అవసరాలపై సమగ్ర సమాచారం సేకరించాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తే గ్రామాభివృద్ధి మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ అనూష, డీఎల్‌పీఓ ప్రభాకర్, ఎంపీడీవో సుభాషిని, ఎంపీఓ సంధ్య, ఉప సర్పంచ్‌తో పాటు ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయితీ రాజ్ డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక సందర్శన



ప్రజాస్పూర్తి, ఖమ్మం జిల్లా : తల్లాడమండల ప్రజా పరిషత్ కార్యాలయం, తల్లాడ మండల పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీధర్ రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ఈ నెల 12వ తేదీ లోపు కనీసం 20 పంట కుంటలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా 14వ తేదీ లోపు అన్ని గ్రామ పంచాయతీలు సమగ్ర అభివృద్ధి ప్రణాళికని సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్ రాజు, ఎంపీఓ చలపతి , కల్లూరు డిఎల్పీఓ విజయ లక్ష్మి, అదనపు పీడీ శిరీష , ఎంపీవో తల్లాడ హార్టికల్చర్ & ఏనుకూరు నారాయణ , ఎనీటీఏం డీపీఎం అనూప్ , మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తల్లాడ మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో జైల్ భరో విజయవంతం చేయాలి

*** భూక్య రమేష్ పిలుపు**




ప్రజాస్పూర్తి , కొత్తగూడెం : కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం వ్యవసాయ కార్మికుల కూలి పెంచుట కోసం రైతులకు గిట్టుబాటు ధరను కల్పించుట కోసం కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమిస్తున్న పోరాటంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ పిలుపునిచారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ, కార్పొరేట్ విధానాలు ఆలంబిస్తున్న మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10వ తేదీన జైలుభరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని , కొత్తగూడెం పట్టణంలో ఉన్న కార్మికుల పని ప్రాంతాల్లో సభలు నిర్వహించడం జరిగింది.. సింగరేణి మెయిన్ స్టోర్ వద్ద జరిగిన సభలో భూక్యా రమేష్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల ను కార్పొరేట్ కంపెనీలకు దాసోహం చేస్తున్న మోదీ సర్కారు, వేతనాల్లో కోతలు పెట్టి, పని గంటలు పెంచి వారి శ్రమను దోచుకుంటున్న పద్ధతి కి వ్యతిరేకంగా కార్మికులు నడుం బిగించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. . ఈ కార్యక్రమంలో గుగులోత్ సక్రం ,రాణి, వెంకటేశ్వర్లు, వెంకట్ ,రాధా, గోవిందు అజ్మీర శీను, భంగి తదితరులు పాల్గొన్నారు .

# ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోని ప్రభుత్వం

*** టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్**



మహబూబాబాద్, ప్రజాస్పూర్తి : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఇచ్చిన దశల వారి పోరాట కార్యక్రమంలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాల బ్రాహ్మణపల్లిలో నల్ల బ్యాడ్జీలు ధరించి పాఠశాలకు హాజరై మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఆరు డీఏలు పెండింగ్లో ఉన్నాయని, పిఆర్సి కమిషన్ వేసి మూడు సంవత్సరాలు దాటిపోయిందని వాపోయారు. మే నెలలో సమస్యల పరిష్కారం కొరకు ఉద్యోగులు ఉద్యమం చేస్తున్న నేపథ్యంలో కొద్దిరోజుల్లోనే మీ సమస్యలు పరిష్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి, ముఖ్య మంత్రి హామీ ఇచ్చారని కానీ ఇప్పటివరకు డి ఏల న్న విషయంలో పిఆర్సి విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే సిపిఎస్ ను రద్దు చేశారని తెలంగాణలో సిపిఎస్ రద్దు కొరకు ఎలాంటి కార్యాచరణ తీసుకోలేదని తక్షణమే సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధారావత్ బద్రు, పాలకుర్తి మౌనిక, మాడిశెట్టి సూర్యప్రకాష్, గొట్టిముక్కల పవన్ రాజ్ ,కుప్పం సూర్య తేజ, బానోత్ శంకర్, గిద్ద శృతి పాల్గొన్నారు.

# తల్లిపాలు.. అమృతంతో సమానం

*** సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో తల్లిపాలు అమృతంతో సమానమని సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో అంగన్వాడి 1, 2 కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు తప్పనిసరి అన్నారు. చిన్నారి ఎరుగుదలకు తల్లిపాలు శ్రేష్టమన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అంగన్వాడీల ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ శ్వేత, బొమ్మ అమరావతి, ఫాతిమా, దోనూరి కిరణ్ రెడ్డి, పాక రాము, సుంకరి శ్రీను, దేశట్ల చైతన్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సూపర్వైజర్ ఝాన్సీ, ఆరోగ్య సిబ్బంది గోపీనాథ్, అంగన్వాడీలు జంగమ్మ, జ్యోతి, ఆశా వర్కర్లు యశోధ, శోభ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపండి

*** బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్**



ప్రజాస్పూర్తి , నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, రాస్తారోకో, కళాశాల బహిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ "ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులని విద్యకు దూరం చేస్తున్నారు. పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల చదువులపై దాడి చేస్తున్నారు" అని తీవ్రంగా ధ్వజమెత్తారు. గత 4 నెలలుగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా ప్రభుత్వానికి కనీస చలనం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జి అజయ్ కుమార్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కన్నబోయిన రాజు యాదవ్, నాయకులు కొంపల్లి రామన్న గౌడ్, పొగాకు రవికుమార్ యాదవ్, మల్లబోయిన తరుణ్ కుమార్, అనంత నాగరాజు గౌడ్, అంబటి శివకుమార్, గడగోజు విజయాచారి తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహణ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

*** జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి**

భువనగిరి, ప్రజాస్పూర్తి : మినీ మీటింగ్ హాల్ లో అన్ని శాఖల అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్ల పై ఆయా శాఖల వారీగా సమీక్షించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలు నిర్వహించనున్నందున అందుకనుగుణంగా వేదిక, వి ఐపిలు, అధికారులకు, ఇతరులకు అనుకూలంగా సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా శాఖల వారీగా, స్టాల్స్, శకటాల ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతిబింబించేలా స్టాల్స్, శకటాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ ,భువనగిరి ఆర్డిఓ కృష్ణా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమం



హుస్నాబాద్, ప్రజాస్పూర్తి : సిద్దిపేట జిల్లా,హుస్నాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా మనందరి బాధ్యత అని అన్నారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని భావితరాలకు అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక చైర్‌పర్సన్, కమిషనర్ కౌన్సిలర్లు,మున్సిపల్ అధికారులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు విద్యార్థులు ప్రజాప్రతినిధులు , సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలి

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



కుత్బుల్లాపూర్,ప్రజాస్పూర్తి : అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. శుక్రవారం గాజుల రామారం డివిజన్ శ్రీరామ్ నగర్ బి కాలనీలోని శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంలో బోనాల పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆంజనేయులు యాదవ్, నర్సింగ్ రావు, తిరుపతి యాదవ్, అమర్నాథ్, శ్రీనివాస్, మల్లేష్, మహేందర్, ప్రసాద్, శంకర్, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, దూలప్ప, సింగారం మల్లేష్, శేఖర్, శివ నాయక్, జునైద్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## చేనేత రంగం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

* **సూరారం డివిజన్ మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : చేనేత రంగం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని సూరారం డివిజన్ మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఉమ్మడి గాజులరామారం డివిజన్ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సాయినాథ్ నేత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం ముఖ్య సలహాదారులు, జీహెచ్ఎంసీ సూరారం డివిజన్ మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చేనేత వస్త్రాల ప్రత్యేకత, వాటి గొప్పతనాన్ని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి గాజులరామారం పద్మశాలి సేవా సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ మచందర్, ప్రధాన కార్యదర్శి సారంగి అశోక్, ఉపాధ్యక్షులు బద్రి, ఆవిడపు సతీష్, కార్యదర్శులు మోకుల శంకర్, గోంటెల శ్రీనివాస్, కుల పెద్దలు ఆంజనేయులు, దామోదర్, ఈశ్వర్ ప్రసాద్, సాయి కిరణ్, దేవరపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తాం

* **రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, సత్యనారాయణపురం, ఇందిరమ్మ కాలనీలలో జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్‌తో కలిసి కాలినడకన కాలనీల్లో తిరుగుతూ మంత్రివర్యులు అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య పరిస్థితులు, ప్రజా మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను విలీనం చేసి ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేశారని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. వెంకట్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ పి వి వైరస్ పై అపోహలు తొలగించుకోవాలి

* **మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవనీత**




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి: హెచ్ పి వి వైరస్ పై అపోహలు తొలగించుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవనీత అన్నారు. శుక్రవారం హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో జగద్గిరి గుట్ట,మార్కండనగర్ లోని నాగార్జున హై స్కూల్ లో బాలికలకు హెచ్ పి వి హ్యూమన్ పాపిలోమా వైరస్ , రుతుక్రమం పై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవనీత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ పి వి వ్యాక్సిన్ సురక్షితమైనదన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఇవ్వబడిందన్నారు. భవిష్యత్తులో వచ్చే ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షిస్తుందన్నారు. వ్యాక్సిన్ తీసుకున్నప్పటికీ, మహిళలు వయస్సుకు అనుగుణంగా వైద్యుల సూచన మేరకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. 9-14 సంవత్సరాల బాలికలకు వేయించడం అత్యంత ప్రభావవంతమన్నారు. 15-26 సంవత్సరాల వయస్సు వరకు కూడా వైద్యుల సలహాతో తీసుకోవచ్చు అని ఆమె చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ బి.కిషన్ రావు,హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ వ్యవస్థాపకులు తూటే విజయ్ కుమార్,ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే,వెబ్రెక్స్ సందీప్ బల్లెం,సంస్థ సభ్యులు నగేష్,పి హెచ్ సి సిబ్బంది అమృత,శ్యామల, పాఠశాల ఉపాధ్యాయ బృందం అనురాధ,అశ్వని, శారదా, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం



ప్రజాస్ఫూర్తి, బైంసా : కడెం మండలం ఉడుంపూర్ గ్రామంలో పోడు భూముల వివాదం నేపథ్యంలో అటవీ అధికారులు, గ్రామస్తులు సంయమనం పాటించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉడుంపూర్ గ్రామస్తులు, అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని పోడు భూముల రైతులు, అటవీ శాఖ అధికారులతో కలెక్టర్ విడివిడిగా చర్చించి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలు తలెత్తినప్పుడు పరస్పర చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి జిల్లా పరిపాలన పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, గ్రామస్తులు శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నారని, ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ఉడుంపూర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప దేవాలయం యొక్క టెండర్ అప్రూవల్ కాపీని అందజేసిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలంలోని గొల్లమడ గ్రామంలో శ్రీ బీరప్ప దేవాలయం యొక్క టెండర్ అప్రూవల్ కాపీని ఈరోజు కురుమ కుల సంఘ సోదరులకు అందజేయడం జరిగింది అగ్రిమెంట్ కాగానే పనులు ప్రారంభమవుతాయని అన్నారు.బీరప్ప దేవాలయం యొక్క టెండర్ అప్రూవల్ ఇచ్చినందుకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖకు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మాజీ శాసనసభ్యులు గాడ్డి విఠల్ రెడ్డి ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు గంగయ్య, సతీష్, భోజన్న, లక్ష్మణ్, వెంకటేష్, పోతన్న, పోతన్న, లక్ష్మణ్, పోతన్న, సాయన్న, చిన్నాన్న, నాగన్న , కుల సంఘ సోదరులు ఉన్నారు.

## ఇంటింటికీ తాగునీటి విప్లవానికి దశాబ్ది

హైదరాబాద్ : తెలంగాణలో ప్రతి ఇంటికీ సురక్షిత, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన మిషన్ భగీరథ పథకం నేటితో పదేండ్లు పూర్తి చేసుకోవడం సంతోషకరమని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో ఇంటింటికీ తాగునీటి విప్లవానికి దశాబ్ది కాలం పూర్తయ్యిందని ఎక్స్ వేదికగా శుక్రవారం వీడియోను షేర్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ.. దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణలో ఫ్లోరోసిస్ రక్కసిని రూపుమాపిన సుజల వ్యవస్థగా పేరుగాంచిందని వివరించారు. మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితో రూపుదిద్దుకున్న మిషన్ భగీరథ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిర్వీర్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సరిగ్గా పదేండ్ల క్రితం ఇదే రోజు గొప్ప ఆలోచనతో ప్రారంభమైన ఈ పథకం ప్రజల తాగు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపిందని తెలిపారు. మిషన్ భగీరథ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న అతిపెద్ద తాగునీటి మౌలిక వసతుల ప్రాజెక్టుగా నిలిచిందని గుర్తు చేశారు. దేశానికి రోల్ మోడల్‌గా నిలిచి హర్ ఘర్ జల్ పథకం అయిందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఒక పథకం కాదనీ, తెలంగాణ ప్రజల జీవితాలను మార్చిన మహత్తరమైన ప్రణాళిక అని వివరించారు. రాష్ట్రంలో ఏ ఇంట్లోనూ తాగునీటి కోసం ఇబ్బంది ఉండకూడదనీ, ఏ తల్లి కూడా బిందె పట్టుకుని కిలోమీటర్ల దూరం నడవకూడదనీ, ఏ గ్రామం కూడా వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కోకూడదనే సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం ఈ బృహత్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.

# 'మిస్ హైదరాబాద్' అంటే నమ్మలేకపోయా!

**శ్రీగౌరీప్రియ... వెబ్ సిరీస్‌లతోపాటు సినిమాలూ చేస్తూ... మంచినటిగా గుర్తింపు తెచ్చుకుంటున్న తెలుగు హీరోయిన్. 'మ్యాడ్' మూవీతో మంచి ఫాలోయింగ్‌నీ సంపాదించుకుందీ భామ. 'చెన్నై లవ్‌స్టోరీ'తో మరోసారి ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈ అమ్మడు ముచ్చట్లు...**

### స్టేజ్ ఫియర్ లేదు

పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. అమ్మ వసుంధర. నాన్న శ్రీనివాస్‌రెడ్డి. చిన్నప్పటి నుంచీ సాంస్కృతిక కార్యక్రమాలపైన ఆసక్తి ఎక్కువ. స్కూల్లో, కాలేజీలో ఏ పోటీలు జరిగినా పాల్గొనేదాన్ని. అలా నాకు స్టేజ్ ఫియర్ పోయి, ఆత్మవిశ్వాసం పెరిగింది.

### కలలోనైనా అనుకోలేదు

యాక్టింగ్ వైపు వస్తానని కలలో కూడా అనుకోలేదు. 'మిస్ హైదరాబాద్'గా ఎంపికైన తరువాత అవకాశాలు వచ్చాయి. 'నిర్మలా కాన్వెంట్', 'మనలో ఒకడు', 'ఫిదా', 'లవ్‌స్టోరీ' సినిమాల్లో చిన్న పాత్రల్లో నటించా. హీరోయిన్‌గా ఫస్ట్ మూవీ 'మెయిల్'. 'మ్యాడ్'తో మంచి గుర్తింపు వచ్చింది. ఆ తరువాత ఎక్కడికెళ్లినా... 'చెంపదెబ్బ కొట్టే అమ్మాయి' అనేవారు.

### చాదస్తంగా ఉండను

నటిగా గుర్తుండిపోయే క్యారెక్టర్స్ చేయాలనుంది. కానీ, డ్రెస్సింగయినా, క్యారెక్టరైనా నాకంటూ కొన్నిహద్దులు ఉన్నాయి. అలాగని మరీ ఎక్కువ చాదస్తంగానూ ఉండను. నా మర్యాద నేను కాపాడుకోవడానికే ఆ రూల్స్ పెట్టుకున్నా.

### పాత్రపైన అవగాహన అవసరం

డైరెక్టర్ అనుకున్నట్టు క్యారెక్టర్ రావాలంటే, ముందు నా పాత్రపైన నాకు పూర్తి అవగాహన ఉండాలి. అందుకే షూటింగ్‌లో ఎలాంటి సందేహాలు ఉన్నా... మొహమాటం లేకుండా అడిగేస్తా. అందుకు డైరెక్టర్లూ ఏమీ అనుకోరు.

### నగలు ఎక్కువ కొంటా

అందరమ్మాయిల్లాగే నాకూ నగలంటే ఇష్టం. జ్యువెలరీ షాప్‌కి వెళ్లినప్పుడు... స్వీట్ షాప్‌కి వెళ్లిన చిన్నపిల్లలా మారిపోతా. అక్కడున్న ఆభరణాలన్నీ కావాలనిపిస్తుంది. వీలయినప్పుడల్లా నగలు కొంటా. చీరలంటే ఇష్టం. అమ్మ చీరలు కట్టుకుంటా.





### పదేళ్లు సంగీతం నేర్చుకున్నా...

చిన్నప్పుడు పదేళ్లు సంగీతం నేర్చుకున్నా. 'బోల్ బేబీ బోల్' ప్రోగ్రాంలో రెండుసార్లు పాల్గొని... ఒకసారి రెండో రన్నరప్‌గా, మరోసారి మొదటి రన్నరప్‌గా నిలిచా. కొన్నేళ్లు యాంకర్‌గానూ చేశా. రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్‌లో డిస్ట్రిక్ట్ లెవల్ వరకూ వెళ్లా.

### సరదాగా అప్లై చేశా

కనీసం ఒక్క రౌండయినా దాటుతామో లేదో చూద్దామని సరదాగా పదిమంది ఫ్రెండ్స్ కలిసి 'మిస్ హైదరాబాద్' పోటీలకు అప్లయ్ చేశాం. నేను మాత్రమే ఫైనల్ వరకూ వెళ్లా. అప్పుడే కొంచెం ప్రిపేరయ్యా. ఫైనల్‌కి రెండు రోజుల ముందు హైహీల్స్‌తో ప్రాక్టీస్ చేస్తూ... కిందపడితే మోకాలికి దెబ్బ తగిలింది. నడవలేనని అందరూ చెప్పినా... ఫైనల్‌లో పాల్గొన్నా. టాప్ ఫైవ్‌కి చేరుకున్నప్పుడు జడ్జీలు ఒక ప్రశ్న ఇచ్చి, తొంభై సెకన్లలో పేపర్‌పైన సమాధానం రాయమన్నారు. అదే సమయంలో నా పెన్ను రాయలేదు. మీడియావాళ్ల వద్దకి పరిగెత్తి, ఒకరి పెన్ను తీసుకుని రాసేశా. 'మిస్ హైదరాబాద్' టైటిల్ నాదే అంటే నమ్మలేకపోయా.

### తీరిక సమయాల్లో...

పాటలు పాడతా. సినిమాలూ చూస్తుంటా. జిమ్‌లో వర్కవుట్లూ చేస్తా. టెంపుల్స్‌కి కూడా వెళ్తుంటా.

### నచ్చినవన్నీ వండేస్తా

వంట చేయడం ఇష్టం. నచ్చిన వంటకాలన్నీ నేనే వండుకుని తినేస్తా. బిర్యానీ ఫేవరెట్. కాఫీ అంటే పిచ్చి. ఎక్కడెక్కడ కొత్త కాఫీ వెరైటీలు దొరుకుతున్నాయో కనుక్కొని మరీ... అక్కడికెళ్లి తాగేస్తా.

### అప్పుడు చాలా భయపడ్డా

నాకు అన్ని విషయాల్లోనూ అమ్మ మెంటార్‌గా ఉండేది. కానీ, ఒక్కసారిగా తనకు క్యాన్సర్ చివరి దశలో ఉందని తెలిసింది. రెండు నెలల్లోనే చనిపోయింది. అప్పుడు చాలా భయపడ్డా. బరువు కూడా బాగా తగ్గా. ఇప్పటికీ అమ్మను తలుచుకోగానే కన్నీళ్లు వచ్చేస్తాయి.

## ఒక్క మూవీకే 830 కోట్ల రెమ్యునరేషన్



అవెంజర్స్ ఫ్రాంచైజ్‌కు సీక్వెల్‌గా అవెంజర్స్ డూమ్స్ డే మూవీ ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా కోసం రాబర్ట్ డౌనీ జూనియర్ 830 కోట్ల రెమ్యూనరేషన్ స్వీకరించి చరిత్ర సృష్టించాడు. వరల్డ్ సినిమా హిస్టరీలోనే ఓ సినిమా కోసం అత్యధిక పారితోషికం స్వీకరించిన హీరోగా నిలిచాడు. అవెంజర్స్ గత సినిమాల్లో ఐరన్ మ్యాన్‌గా సూపర్ హీరో పాత్రలో కనిపించిన రాబర్ట్ డౌనీ అవెంజర్స్ డూమ్స్ డేలో మాత్రం విలన్‌గా నటిస్తోన్నాడు. మూడు గ్రహాలు ఒకదానినొకటి ఢీకొని సృష్టి అంతమయ్యే పరిస్థితి వస్తుంది. అవెంజర్స్‌తో పాటు ఫెంటాస్టిక్ ఫోర్, ఎక్స్‌మెన్ కలిసి ఈ ప్రమాదం నుంచి భూమిని ఎలా కాపాడారు అనే కథతో ఈ మూవీ తెరకెక్కుతోంది.

## పాటకు కోటి అడిగిందట

భాగ్యశ్రీ బోర్సే కెరీర్‌లో ఫస్ట్ టైమ్ ఓ ఇండిపెండెంట్ మ్యూజిక్ వీడియో సాంగ్‌లో నటించబోతుంది. అల్లు అర్జున్ రాకా మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్‌తో కలిసి స్టెప్పులు వేయబోతుంది. మూడున్నర నిమిషాల పాట కోసం భాగ్యశ్రీ బోర్సే భారీగా రెమ్యూనరేషన్ డిమాండ్ చేసినట్లు సమాచారం. త్వరలోనే చెన్నైలో సాయి అభ్యంకర్, భాగ్యశ్రీలపై ఈ సాంగ్‌ను షూట్ చేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మూడున్నర నిమిషాల నిడివితో సాగే ఈ పాట కోసం భాగ్యశ్రీ కోటి రూపాయల రెమ్యూనరేషన్ డిమాండ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం తమిళంలో శివకార్తికేయన్‌తో సియోన్ సినిమా చేస్తోంది భాగ్యశ్రీ. ఇటీవల రిలీజైన తెలుగు మూవీ లెనిన్‌తో కెరీర్‌లో ఫస్ట్ హిట్‌ను అందుకుంది ఈ అందగత్తే.





## ఓటీటీలోకి కంగనా మూవీ

కంగనా రనౌత్ హీరోయిన్‌గా నటించిన భారత భాగ్య విధాత ఓటీటీలోకి వచ్చేస్తోంది. ఆగస్ట్ 14 నుంచి జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ కాబోతుంది. ముంబై ఎటాక్స్‌లో వందలాది మంది ప్రాణాలు కాపాడిన అంజలి కుల్తే అనే నర్స్ జీవితం ఆధారంగా ఈ మూవీ రూపొందింది. దాదాపు 45 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ థియేటర్లలో ఏడు కోట్ల లోపే వసూళ్లను దక్కించుకుంది. ఈ ఏడాది బాలీవుడ్ అత్యధిక నష్టాలను మిగిల్చిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. సర్వైవల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ మూవీకి మనోజ్ తపాడియా దర్శకత్వం వహించగా కంగనా రనౌత్ ఓ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించింది. గిరిజా ఓక్, స్మితా తాంబే, సయాజీ షిండే కీలక పాత్రల్లో కనిపించారు. జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ అందించాడు.

## నెగెటివ్ పాత్రలో శ్రీలీల

ధమాకా బ్యూటీ శ్రీలీల బాలీవుడ్‌లో ఓ రొమాంటిక్ థ్రిల్లర్ మూవీని అంగీకరించింది. హాలీవుడ్ బ్లాక్‌బస్టర్ మూవీ అబ్సెషన్ తరహాలో చాలా వయలెంట్ థ్రిల్లర్‌గా ఈ మూవీ ఉండబోతున్నట్లు టాక్ నడుస్తోంది. ఎక్తా కపూర్ నిర్మించనున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ మరో హీరోయిన్‌గా నటించబోతుంది. ట్రయాంగిల్ లవ్‌స్టోరీగా తెరకెక్కనున్న ఈ మూవీ షూటింగ్ అక్టోబర్ లేదా నవంబర్ నుంచి మొదలుకాబోతున్నట్లు సమాచారం. ఇందులో శ్రీలీల, జాన్వీకపూర్ ఇద్దరి రోల్స్ నెగెటివ్ షేడ్స్‌లో ఉండబోతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఉమేష్ బిస్త్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను ఎక్తా కపూర్‌తో కలిసి గునీత్ మోంగా ప్రొడ్యూస్ చేయబోతున్నారు. హీరోయిన్లు ఫిక్సైనా.. ఈ సినిమాకు ఇంకా హీరో మాత్రం దొరకలేదని టాక్.



## హాలీవుడ్ ఆఫర్ కొట్టేసింది

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా హాలీవుడ్‌లో ఓ బంపరాఫర్ అందుకుంది. ఆస్కార్ విన్నింగ్ హీరో రసెల్ క్రోతో ఓ సినిమా చేయబోతుంది. సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించబోతుంది. స్పెషల్ కమాండోగా ప్రియాంకపై వచ్చే యాక్షన్ సీన్లు సినిమాకు హైలైట్‌గా ఉంటాయని అంటున్నారు. ఈ మూవీకి బ్లూఫై అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ప్రియాంక చోప్రా హాలీవుడ్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్‌తో ఈ మూవీ తెరకెక్కుతోంది. ప్రెడెటర్ ఫేమ్ నిమ్రోద్ అంటల్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఆమెనే స్వయంగా సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. కాగా మహేష్‌బాబు వారణాసితో దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఇండియన్ సినిమాల్లోకి రీఎంట్రీ ఇస్తోంది ఈ అందగత్తే. ఇందులో మందాకిని అనే పాత్రలో కనిపించబోతుంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.